క్లుప్తంగా

ఆలయ ప్రతిష్టకు ఆహ్వానం



సాయిరాజ్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

కంచిలి: పోలేరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సిపి నేత పిరియా సాయిరాజ్‌ను ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఆదివారం బల్లిపుట్టుగలోని నివాసానికి వెళ్లి ఆహ్వానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బల్ల తిరుపతి, కృష్ణ, తారకేష్ ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పరీక్ష సామగ్రి అందజేస్తున్న దృశ్యం

మందస: వీరగున్నమ్మపురంలోని వెనుకబడిన తరగతుల వసతిగృహంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సంక్షేమాధికారి టి.అప్పారావు ఆదివారం పరీక్ష సామగ్రి అందజేశారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పాపారావు, వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్య అన్నదానానికి రూ. లక్ష విరాళం



చెక్కును ఈవో చంద్రశేఖర్‌కు అందజేస్తున్న దాత అప్పలసూరి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విశాఖపట్నం వాస్తవ్యులు ఆకుల అప్పలసూరి, అన్నపూర్ణ దంపతులు రూ. లక్ష విరాళం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు ఆదివారం అందజేశారు. అంతకుముందు దాతలు కుటుంబసభ్యులతో కలిసి ఆదిత్యున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు నేతేటి హరిప్రసాద్ శర్మ, సిబ్బంది బి.ఎస్.చక్రవర్తి ఉన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ట ప్రారంభం



బాహుదానది వద్ద జలాభిషేకం కోసం పూజలు చేస్తున్న భక్తులు, గ్రామస్తులు

ఇచ్ఛాపురం రూరల్: సన్యాసిపుట్టుగలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం ప్రారంభమైంది. ఆదివారం హరే రామ హరేకృష్ణ నామ సంకీర్తనల మధ్య భక్తులు బాహుదానది నుంచి కలశాలతో జలాన్ని తెచ్చి పండితుల వేద మంత్రాలతో ఆలయంలో జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఓం నమో వెంకటేశాయ నామంతో హోరెత్తించారు. ఈ నెల 24వ తేదీ వరకు ప్రతిష్ఠ మహోత్సవం, యజ్ఞ యాగాదులు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

మాజీ సైనికుల ఔదార్యం



భక్తులకు మజ్జిగ అందజేస్తున్న మాజీ సైనికులు

పలాస: పలాసకు చెందిన మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ సైనికులు పలాస జామి యాత్ర సందర్భంగా ఆదివారం భక్తులకు మజ్జిగ, మంచి నీరు సరఫరా చేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఉదయం పది గంటల నుంచే పలాస కాశీబుగ్గ కేటీ రోడ్డు యాత్రికులతో పోటెత్తింది. వేలాది మంది యాత్రికుల రాక సందర్భంగా పలు స్వచ్ఛంద సంఘాలు ప్రజలకు అన్నదానం, పులిహోర, మజ్జిగ, మంచినీరు సరఫరా చేసి ప్రజల చేత మన్ననలను పొందారు.

పలాసలో 8 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు

పలాస: పలాస మండలం, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఎనిమిది కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి జరుగునున్నాయని ఎంఈవో శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఈ కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 1582 మంది, ప్రైవేటు విద్యార్థులు వంద మంది పరీక్షకు హాజరవుతారన్నారు. చిన్నబాడాం జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో 160 మంది, కాశీబుగ్గ జిల్లా పరిషత్‌లో పాఠశాలలో 260 మంది, రెంగోయిలో 72 మంది, బ్రాహ్మణతర్లాలో 111 మంది, కాశీబుగ్గ ఎస్.ఎఫ్.ఎస్‌లో 251 మంది, పలాస జేహెచ్ఎస్‌లో 240 మంది, శ్రీచైతన్యలో 260 మంది, నారాయణలో 238 మంది పరీక్షకు హాజరవుతారన్నారు.

వైభవంగా ఎల్లమ్మ జాతర



సోంపేట: పూజలందుకుంటున్న ఎల్లమ్మతల్లి



ఇచ్ఛాపురం: ఎల్లమ్మ గుడివద్ద బారులుదీరిన భక్తులు



ఇచ్ఛాపురం: విక్రయానికి తీసుకొచ్చిన మట్టికుండలు



కాశీబుగ్గ: జనసంద్రమైన పట్టణ రోడ్డు

- పలాస యాత్రకు పోటెత్తిన భక్తజనం
- 20 వేల మందికిపైగా భక్తులకు పీసీఎంఏ అన్నదానం

కాశీబుగ్గ: జామి ఎల్లమ్మ జాతర సందర్భంగా పలాస పట్టణం ఆదివారం జనసంద్రంగా మారింది. వేకువ జామున నాలుగు గంటలకు ప్రారంభమైన జాతర మహోత్సవం రాత్రి వరకు కొనసాగింది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా కాశీబుగ్గ బస్టాండ్ వరకు మాత్రమే బస్సులు, భారీ వాహనాలకు పోలీసులు అనుమతి ఇచ్చారు. కాశీబుగ్గ కేటీ రోడ్డు మొదలు కొని పలాస కేటీ రోడ్లు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పూజా సామగ్రి విక్రయదారులు, కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. ఈ సందర్భంగా పీసీఎంఏ చారిటబుల్ ట్రస్టు సభ్యులు 20 వేలకు మందికిపైగా భక్తులకు అన్నదానం చేశారు. అలాగే విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు, సత్యసాయి, లయన్స్‌క్లబ్, ఆర్ఎస్ఎస్, కన్యకాపరమేశ్వరి, విశ్వకర్మ సంఘాల భక్తులు కూడా పులిహోరా, బిరియాని, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, సీఐ విజయానంద పర్యవేక్షణలో ఇచ్ఛాపురం, టెక్కలి, పలాస, పాతపట్నం పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్సైలు, వంద మందికిపైగా పోలీసులు, 40 మంది ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహించారు. మొగిలిపాడు నుంచి రావాల్సిన వాహనాలను కోసంగిపురం కూడలి మీదుగా మళ్లించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకండా ఏర్పాట్లు చేశారు.

సోంపేట: సోంపేట పట్టణం ఎల్లమ్మ యాత్ర వైభవంగా జరిగింది. అమ్మవారిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని పిరియా విజయ, ఎంపీపీ నిమ్మన దాస్ ఎల్లమ్మను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎస్సై బి.హేమావతి బందోబస్తు చర్యలు చేపట్టారు.

ఇచ్ఛాపురం: పట్టణంలోని బెల్లుపడ రోడ్డులో ఉన్న ఎల్లమ్మ గుడివద్ద జామియాత్రను ఘనంగా నిర్వహించారు. సుమారు పది వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని కమిటీ ప్రతినిధులు తెలిపారు. సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు పర్యవేక్షణలో పట్టణ, రూరల్ ఎస్సైలు సత్యన్నారాయణ, లక్ష్మణరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. మట్టితో తయారుచేసిన నల్ల రంగు మట్టికుండలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీటిని కొనుగోలు చేసేందుకు భక్తులు పోటీపడ్డారు..

వజ్రపుకొత్తూరు రూరల్: బైపల్లి, అక్కుపల్లి గ్రామ పరసరాల్లో జామిఎల్లమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దుమ్ము వంశీయుల సమక్షంలో జరిగిన ఈ యాత్రకు భక్తులు పోటెత్తారు. అనంతరం భక్తులకు అన్నసంతార్పణ చేశారు.

కంచిలి: మండలంలోని పలు గ్రామాల్లో జామి ఎల్లమ్మ జాతరను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. జాడుపూడి గ్రామంలో ఎల్లమ్మ అమ్మవారిని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు దర్శించుకున్నారు. జాతరకు వచ్చిన భక్తులకు దివంగత జెడ్పీటీసీ సభ్యుడు పలికల భాస్కరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు జయరాం వాటర్ బాటిళ్లను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావుల ద్వారా పంపిణీ చేశారు. తలతంపర గ్రామంలో జరిగిన ఎల్లమ్మ జాతరలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణారావు పాల్గొన్నారు.

మందస: గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే జామి ఎల్లమ్మతల్లి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. మూలిపాడు పంచాయతీలోని గోపాలపురం–శ్రీనివాసపురంలో గల ఎల్లమ్మతల్లి జాతరకు సోంపేట, మందస, కంచిలి మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ఎల్లమ్మతల్లిని దర్శించుకున్నారు. ఆలయంలో ఉండే పుట్టకు భక్తులు అర్చకులు గుగ్గిలాపు చిన్నారావు, కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సర్పంచ్ గుసిరి వెంకటరావుతో పాటు మాజీ సర్పంచ్ గౌరహరిమహంతి, ఉపసర్పంచ్ రామచంద్రచౌదరి, నాయకులు సేనాపతి ఈశ్వరరావు, దట్టి కోదండరావు, గుసిరి నాగేశ్వరరావు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం, కొఠారీ, ధర్మపురం, కొళిగాం గ్రామాల్లో ఎల్లమ్మ జామి జాతరను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు మేళతాళాలతో ఎల్లమ్మ జంగిడిని ఊరేగించారు. అనంతరం అమ్మవారి ప్రతిరూపాలైన ఎల్లమ్మ పుట్టకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



కంచిలి: తలతంపరలో ఎల్లమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ రామారావు, జెడ్పీటీసీ సభ్యురాలు లోలాక్షి



మందస: ఎల్లమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు



ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో ఎల్లమ్మ జాతరకు హాజరైన భక్తులు



కంచిలి: జాడుపూడిలో జామి ఎల్లమ్మను దర్శించుకుంటున్న పిరియా విజయ



వజ్రపుకొత్తూరు రూరల్: అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



కాశీబుగ్గ: పలాసలో ఎల్లమ్మతల్లి ఆలయం వద్ద భక్తుల రద్దీ



కాశీబుగ్గ: పలాస ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద పీసీఎంఏ ఆధ్వర్యంలో అన్నదానం



కాశీబుగ్గ: పుట్టవద్ద ఎల్లమ్మతల్లి ప్రతిమ

టెక్కలిలో ఫ్లెక్సీలు తొలగింపు



ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం మండలంలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది

టెక్కలి: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో అధికారులు ఎన్నికల విధుల నిర్వాహణలో బిజీగా మారారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో పట్టణంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించే చర్యలు చేపట్టారు. స్థానిక జగతిమెట్ట నుంచి పాతబస్టాండ్ వరకు బహిరంగ ప్రదేశాల్లో ఉన్న ఫ్లెక్సీలను ఆదివారం తొలగించారు.

ఇచ్ఛాపురంలో..

ఇచ్ఛాపురం రూరల్: ఎన్నికల కోడ్ ప్రారంభం కావడంతో నియోజకవర్గస్థాయిలో ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, గోడపత్రికలు తొలగిస్తున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి బి.సుదర్శదొర తెలిపారు. ఆదివారం ఆయన ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాలతో పాటు మున్సిపాలిటీలో గల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో ఫ్లెక్సీలు, గోడపత్రికలు తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు.

మండలాల వారీగా ఎన్నికల అధికారులు..

మండలాల వారీగా ఎంసీసీలను, ఫ్లైయింగ్ స్క్వాడ్‌ను నియమించారు.

ఎంసీసీలు: ఇచ్ఛాపురం మండలం వై.వి.రాజేంద్ర ప్రసాద్, ఎంపీడీఓ, ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం అర్బన్ ఎస్.రమేష్, కమిషనర్, మున్సిపాలిటీ, కంచిలి మండలం వి.నీరజ–ఎంపీడీవో, కవిటి మండలం కె.వి.ఎ.సత్యన్నారాయణ,ఈఓపీఆర్ఢ, సోంపేట మండలం కె.రామారావు, ఎంపీడీవోలను నియమించారు. అలాగే ఫ్లైయింగ్ స్క్వాడ్‌గా ఇచ్ఛాపురం, కవిటి పి.కుర్మారావు, మహ్మద్ ఆసీఫ్ అబ్బాస్, పూజారి సత్యన్నారాయణ కంచిలికి ఎ.జగదీష్‌బాబు, కె.సత్యన్నారాయణ, కె.వి.రమణమూర్తి సోంపేటకు ఎం.గౌరీశంకర్, ఎం.ముఖేష్, ఆర్.అప్పారావులను నియమించారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నాయకులు



పార్టీలో చేరిన వారితో మంత్రి అప్పలరాజు

మందస: బహడపల్లి, మూలిపాడు పంచాయతీలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో వీరంతా పార్టీ కండువాలు వేసుకున్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామని టీడీపీ నాయకులు అన్నారు. పార్టీలో చేరినవారిలో కోట ప్రేమ్‌కుమార్, సోమేశ్వరరావు, సాలీన రామారావు, గుసిరి నారాయణ, కృష్ణవేణి ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, బహడపల్లి, మూలిపాడు సర్పంచ్‌లు బొడ్డు శాంతిప్రియ, గుసిరి వెంకటరావు, ఏఎంసీ డైరెక్టర్ మట్ట కూర్మారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మామిడి కృష్ణారావు, పార్టీ నాయకులు సార దూర్వాసులు, మామిడి తులసయ్య, కరగాన లక్ష్మీనారాయణ, కర్రి చిన్నయ్య, సాలీన రామారావు, చిరంజీవు ఉన్నారు.

విజయమే లక్ష్యంగా పని చేయాలి



నాయకులతో మాట్లాడుతున్న సాయిరాజ్

ఇచ్ఛాపురం: ఎన్నికలు సమీపిస్తున్నందున వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ కోరారు. ఇచ్ఛాపురంలోని పట్టణ పార్టీ కార్యాలయం ఆవరణలో నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యనేతలు, పార్టీలో వివిధ హోదాలు కలిగిన ప్రతి ఒక్కరూ సైనికుల్లా కష్టపడి పని చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, పట్టణ పార్టీ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ రాంపత్ని చిట్టిబాబు, జేసీఎస్ మున్సిపల్ అధ్యక్షుడు సాలిన డిల్లి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, వార్డు కౌన్సిలర్లు సుగ్గ ప్రేమ్‌కుమార్, పి.మధుమూర్తి, బచ్చుజగన్, పి.తేజేశ్వరరావు, చిడిపోతు జగన్నాయకులు, నాయకులు కాళ్ల సత్యం, ఎండీ షఫీ, కిరణ్ బెహర, దక్కత లోకనాథం, మదన్, దేవ, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఇచ్ఛాపురం రూరల్: టెన్త్ పబ్లిక్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేశామని ఎంఈవో కురమాన అప్పారావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మండలం, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు 1570 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉందన్నారు. మండల పరిధిలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఈదుపురం, ఎం.తోటూరు సత్యసాయి హైస్కూల్, గరల్స్ హైస్కూల్, స్వర్ణభారతి హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్, గవర్నమెంట్ హైస్కూల్ ఇచ్ఛాపురంలో ఆరు కేంద్రాల్లో మార్చి 30వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి సిద్ధం

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని పార్టీ మండల కన్వీనర్ బి.హరి, జేసీఎస్ ఇన్‌చార్జి ఎస్.మోహన్, నాయకులు కె.అజయ్, నాయకులు పి.వైకుంఠరావు, బి.తులసీరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దువ్వాడ శ్రీనివాస్ పేరును ఖరారు చేయడంపై ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పనిచేస్తామని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార పోస్టర్ ఆవిష్కరణ



పార్టీ శ్రేణులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచార పోస్టర్లను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పలాసలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఇప్పటి నుంచే ప్రచారాన్ని ముమ్మరం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ముఖ్యనాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, వజ్రపుకొత్తూరు మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దొంగఓట్ల నమోదుపై ఫిర్యాదు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి లచ్చన్నపేట గ్రామంలో టీడీపీ నాయకులు దొంగ ఓట్లు నమోదు చేశారంటూ ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ యు.విశ్వనాథం అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఇప్పిలి కృష్ణవేణి పేరుతో 115 పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటు ఉండగా, అదే వ్యక్తికి బలగ కృష్ణవేణి పేరుతో 113 పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటరుగా నమోదు చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై అధికారులు స్పందించి టీడీపీ నాయకులు అడ్డంగా చేసిన దొంగ ఓట్లు నమోదుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

'వారిది స్వార్థపూరిత రాజకీయం'

టెక్కలి: టీడీపీ, జనసేన, బీజేపీది స్వార్థపూరిత రాజకీయమని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభతో రాష్ట్రానికి ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. గతంలో మోదీని తీవ్రంగా దూషించిన చంద్రబాబు ఇప్పుడు తన స్వార్థ రాజకీయాలకు మరోసారి తెరతీశారని పేర్కొన్నారు.

కార్పొరేట్ ఆస్పత్రికి దీటుగా..



ఆస్పత్రి గోడపై చిన్న పిల్లల విభాగాన్ని సూచిస్తూ వేసిన బొమ్మలు



వైద్యుడి గదిలో చిన్నారులను ఆకట్టుకునేలా ఉన్న బొమ్మలు

టెక్కలి: రోగంతో ఆస్పత్రికి వెళితే.. అక్కడ వైద్యంతో పాటు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే త్వరగా రోగి కోలుకుంటారు. టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది ఇదే టెక్నిక్ ఫాలో అయ్యారు. ఆస్పత్రిలో చిన్న పిల్లల విభాగంలో పిల్లల్ని ఆకట్టుకునే విధంగా గోడలపై వివిధ రకాల బొమ్మలు వేశారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో తరచూ కనిపించే ఇటువంటి దృశ్యాలు ఇక్కడ దర్శనమిస్తున్నాయి. చిన్న పిల్లల వైద్యుడి వద్దకు వచ్చే చిన్నారులు ఎటువంటి భయాందోళన చెందకుండా వివిధ రకాల బొమ్మలను వేసి వారిని ఆకట్టుకుంటున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సరికొత్త మార్పులతో వైద్య విధానం కొత్తగా రూపు రేఖలు మార్చుకుంటోంది.

మంచిచేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



ప్రచారం చేస్తున్న నాయకులు

కోటబొమ్మాళి: మంచిచేసిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో మరోసారి ఓట్లు వేసి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నూక సత్తిరాజు, పలువురు నాయకులు కోరారు. లఖందిడ్డి పంచాయితీలో మేం సిద్ధం–మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం చేశారురు. సంక్షేమసారథిగా పేరుగాంచిన ముఖ్యమంత్రి జగన్‌కు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లేశ్వరరావు, స్థానిక సర్పంచ్ బమ్మిడి గణపతి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, నాయకులు సుంకరి జనార్దన, తర్ర కామినాయుడు, రాంపాత్రుని శివారెడ్డి, మెట్ట సింహాచలం, బొమ్మాళి రాము, పి.రామం, తలగాన గణపతిరావు, మూల మోహన్ ఉన్నారు.

సంక్షిప్తంగా...

బాలుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

వజ్రపుకొత్తూరు: తలసీమియా వ్యాధితో బాధపడుతున్న బాలుడికి పాతటెక్కలికి దిన పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. ఇచ్ఛాపురం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన దున్న లోహిత్ తలసీమియా వ్యాధితో బాధపడుతున్నారు. దాదాపు రూ. పది లక్షలు ఖర్చు చేస్తే గాని ప్రాణాలు నిలవవు. విషయం తెలుసుకున్న పాతటెక్కలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993–94 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 30 వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాలుడు తల్లి దున్న పార్వతికి పాతటెక్కలికి చెందిన నాయకురాలు తోట పార్వతమ్మ ద్వారా ఆదివారం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గాలి యామారావు, ఎస్.నీలయ్య, సత్యవతి, వనిత, జగదాంబ పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సలకు 45 మంది ఎంపిక

కోటబొమ్మాళి: కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కంటి పరీక్షలు చేపట్టారు. 112 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 45 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్టు క్యాంపు కోఆర్డినేటర్ టి.రామారావు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అంజలి, రాడ బాబూరావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

కాశీబుగ్గ: మున్సిపాలిటీ న్యూకాలనీలో రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ వారితో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 75 మందికి కంటి డాక్టర్ నిఖిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఎనిమిది మందికి శస్త్ర చికిత్సలు, 16 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. పన్షనర్ల సంఘ అధ్యక్షుడు తమ్మినాన మాధవరావు, కార్యదర్శి నెమలిపురి అప్పారావు, మేనేజర్ చంద్రశేఖర్, వెంకటవర్మ, మోహనబాబు, కృష్ణారావు, గౌతమి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఎఫెక్ట్



బస్టాండ్ కూడలిలో రాజకీయ నాయకుని విగ్రహానికి ముసుగు తొడుగుతున్న సిబ్బంది

ఇచ్ఛాపురం: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న రాజకీయ నాయకులు విగ్రహాలకు మున్సిపల్ సిబ్బంది ముసుగులు వేసే పనిలో నిమగ్నమయ్యారు. పట్టణంలోని బస్టాండ్ కూడలి, డైలీమార్కెట్, శ్రీసురంగి రాజా క్రీడామైదానం సమీపంలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు కమిషనర్ ఎస్.రమేష్ పర్యవేక్షణలో సిబ్బంది ఆదివారం ముసుగులు వేశారు. అలాగే గోడలపై అతికించిన అభ్యర్థుల వాల్‌పోస్టర్లను తొలగించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, సిబ్బంది ఉన్నారు.